క్లుప్తంగా

కేంద్రానికి కనువిప్పు కలిగించేందుకే సమ్మె


దేశవ్యాప్త సమ్మె పోస్టర్లు విడుదల చేస్తున్న జిల్లా కోశాధికారి రాయుడు

కూడేరు: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు కార్మికుల సమస్యలపై కనువిప్పు కలిగించేందుకే ఈ నెల 20న దేశవ్యాప్త సార్వత్రి సమ్మె నిర్వహిస్తున్నట్లు అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కోశాధికారి రాయుడు తెలిపారు. గురువారం కూడేరులో దేశవ్యాప్త సమ్మె పోస్టర్లను రాయుడు విడుదల చేశారు. ఏఐకేఎంఎస్ మండల నేతలు సంజప్ప, శ్రీనివాసులు, సుబ్బరాయుడు ఆంజనేయులు, కుళ్లాయిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షాబాజ్ దివాన్‌వలి దీపారాధన


ప్రత్యేక అలంకరణలో స్వామివారి సమాధి

బొమ్మనహాళ్: మండలంలోని కల్లుహోళలో షాబాజ్ దీవాన్ వలీ ఉరుసు మహోత్సవం సందర్భంగా గురువారం దీపారాధన ఘనంగా జరిగింది. దర్గా నిర్వాహకులు, మత గురువులు స్వామిని దర్గాకు ఊరేగింపుగా వెళ్లి దీపారాధన చేశారు. స్వామికి దివ్వెలతో కొబ్బరి వేసి, మొక్కులను తీర్చుకున్నారు. హిందూముస్లింలు పెద్ద ఎత్తున దర్గాను దర్శించుకున్నారు. శుక్రవారం షాబాజ్ దీవాన్‌వలి ఉరుసు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సమయపాలన పాటించాలి


దేవగిరి సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయభాస్కర్

సాక్షి ఎఫెక్ట్..

బొమ్మనహాళ్: సచివాలయ సిబ్బంది సమయపాలన విధిగా పాటించాలని ఎంపీడీఓ విజయభాస్కర్ ఆదేశించారు. ఈనెల 15న 'ఉద్యోగులు ఉన్నట్టా.. లేనట్టా ?' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైంది. దీంతో మండలంలోని దేవగిరి, గోవిందవాడ–2 గ్రామాల్లోని సచివాలయాలను ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది సమయ వేళలు పాటించాలని చెప్పారు. వివిధ పనులు కోసం వచ్చే ప్రజలపై గౌరవంగా మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, సమస్య జఠిలమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం కల్లుదేవనహళ్లి గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ దాస్, సచివాలయ సబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచు వసుంధరమ్మకు నివాళి


వసుంధరమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఉమ

కళ్యాణదుర్గం రూరల్: మేజర్ పంచాయతీ సర్పంచ్‌గా పనిచేసిన వసుంధరమ్మ బుధవారం మృతి చెందింది. వైఎస్సార్‌సీపీ నేత మాదినేని ఉమామహేశ్వరనాయుడు తదితరులు వసుంధరమ్మ మృతదేహానికి గురువారం నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడగట్ట నారాయణ, జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి తలారి సత్తి, తిమ్మగానిపల్లి మల్లి, చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనపై ర్యాలీ


బాల్యవివాహాలపై ర్యాలీ చేస్తున్న దృశ్యం

ఉరవకొండ రూరల్: బాల్య వివాహాలను అరికట్టాలని రాకెట్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ చేశారు. వైద్యాధికారి వెంకటేష్‌నాయక్, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండీ షఫీ, సీహెచ్ఓ నాగరంగయ్య ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల బాలికల చదువు పాడై భవిష్యత్ అంధకారమవుతుందన్నా రు. చిన్న వయస్సులోనే గర్భం దాలిస్తే ఆరోగ్య సమస్యలు వ స్తా య న్నారు. స్టాఫ్‌నర్సులు జినతున్నీసా, కుమారి బాయి, సూపర్‌వైజర్ స్వర్ణలత పాల్గొన్నారు.

సాగుకు సమయమాయె!

- ఖరారు కాని రాయితీ విత్తన ప్రణాళిక
- విత్తన వేరుశనగ వెతుకులాటలో రైతులు
- రాయితీ కోటాలో కూటమి సర్కారు కోత
- ఈనెల 27న నైరుతి పవనాలు ఆగమనం
- సమీక్షలతో సరిపెడుతున్న యంత్రాంగం


నేలను దుక్కి చేస్తున్న రైతన్న


రైతు భరోసా కేంద్రాలకు సరఫరా అయిన విత్తన వేరుశనగ బస్తాలు (ఫైల్)

రాయదుర్గం: అకాల వర్షాలు ఆశాజనకంగా పడుతున్నాయి.. ముంగారు సేద్యాలు ముగిశాయి.. ఖరీఫ్‌రానే వచ్చింది.. సాగుకు సమయమవుతోంది... ఓ వైపు సేద్యం పనులు.. మరోవైపు విత్తనం కోసం వెతుకులాట ప్రారంభమైంది.. అయినా అధికారులు ఇంకా ఖరీఫ్ ప్రణాళికల ఊసే లేదు. అత్యధికంగా వేరుశనగ పండించే రాయదుర్గం, కళ్యాణదుర్గం.. ఆతర్వాత ఉరవకొండలో మెట్ట భూములు అధికంగా ఉండడంతో ఎక్కువశాతం వేరుశనగ, కంది, పత్తి, ఆముదం, సజ్జ, శనగ పంటలసాగు అంచనా కొలిక్కి వచ్చినా, విత్తనాలు, ఎరువుల కేటాయింపుల్లో తడబాటు కనిపిస్తోంది.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని 15 మండలాలకు సుమారు 50 వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ అవసరమైతే, జిల్లా వ్యాప్తంగా 31 మండలాలకు కేవలం 54 వేల క్వింటాళ్ల మాత్రమే విత్తనాలు కేటాయిస్తున్నట్లు ప్రాథమిక నివేదికలు వెల్లడిస్తున్నాయి. దీంతో ఖరీఫ్ రైతుల్లో ఆందోళన మొదలైంది. మూడు నియోజకవర్గాల్లోనూ సుమారు 2,90,473 హెక్టార్లు సాధారణ సాగు విస్తీర్ణం కాగా, అందులో 1,74,179 హెక్టార్లు సాగులోకి వచ్చే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాయదుర్గం డివిజన్‌కు 16,300, కళ్యాణదుర్గం 22,500, ఉరవకొండ 11,700 మొత్తం 50,500 ఆర్‌బీకేల ద్వారా రైతులకు ఎలాంటి ఖర్చులూ లేకుండా ఇంటిగుమ్మం వద్దకే సరఫరా చేశారు. ఈ సారి లెక్కలు చూస్తే ముందే చుక్కలు కనిపిస్తున్నాయని అన్నదాతలు నిట్టూరుస్తున్నారు.

రాయితీకి కోత .. బయట మార్కెట్లో వెత

రాయితీ విత్తన వేరుశనగ కేటాయింపుల్లో కూటమి సర్కార్ కోత విధిస్తే.. బయట మార్కెట్లో కొనలేని పరిస్థితి. ముందస్తు వర్షాలు ఊరిస్తున్నాయి. దీనికి తోడు ఈనెల 27న రాష్ట్రంలోని నైరుతి రుతు పవనాలు రానుందని వాతావరణశాఖ ప్రకటించింది. దీంతో యుద్ధ ప్రాతిపదికన సాగు పనులు పూర్తి చేసేలా రైతులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విత్తనాలు, ఎరువులు కొనేందుకు తంటాలు పడాల్సి వస్తోందనే ఆందోళన అందరిలోనూ మొదలైంది.

సుఖీభవపై అయోమయం..

వైఎస్సార్‌సీపీ హయాంలో ఐదేళ్లు రైతుల సంక్షేమానికి అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేశారు. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు అన్ని రకాల విత్తనాలు, పరుగు మందులు సమయానికి సమకూర్చారు. విత్తు నుంచి విపత్తు వరకూ రైతుకు వెన్నంటే నిలిచారు. ఏటా రైతుభరోసా పథకం ద్వారా ఠంచనుగా రూ.13,500 అందించారు. ఖరీఫ్ సీజన్ ఆరంభంలో పెట్టుబడి సాయంగా రూ.5,500 రైతు ఖాతాల్లో జమ చేసి విత్తనాలు, ఎరువులకు అప్పు చేయకుండా చేదోడు వాదోడుగా నిలిచారు. మూడు నియోజకవర్గాల్లో 7,35,353 మంది రైతులకు పెట్టుబడి సాయం అందించారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు కనిపించ లేదు. రైతు భరోసాకు బదులు 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని అమలు చేసి ఏటా రూ.20 వేలు ఇస్తామని కూటమి సర్కారు ప్రకటించింది. అయితే ఖరీఫ్ సీజన్ ఆరంభమైనా ఇంకా దీనిపై స్పష్టతలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి రైతుకూ రాయితీ విత్తనమివ్వాలి..



ఖరీఫ్‌లో సాగుచేసే ప్రతి రైతుకూ విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా సమకూర్చాలి. రాయితీ విత్తన కేటాయింపుల్లో కోత కోస్తే రైతులతో కలసి వ్యవసాయ కార్యాలయాల వద్ద ఆందోళన చేపట్టాల్సి వస్తోంది. రైతుకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందించాలి. గత ప్రభుత్వ హయాంలో పంపిణీ చేసిన తరహాలోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు అందించాలి. రైతులను తిప్పుకుంటే సహించేదిలేదు. ముందస్తు సాగు అంచనాకు వచ్చిన అధికారులు, విత్తన ఖరారులో జాప్యం సరి కాదు. అర్హత ఉన్న ప్రతి రైతుకూ రాయితీ విత్తనం అందించే బాధ్యత కూటమి సర్కార్ తీసుకోవాలి. సూపర్‌సిక్స్ హామీలో భాగంగా అన్నదాత సుఖీభవ ఎప్పుడిస్తారో రైతులకు చెప్పాలి.

– మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, రాయదుర్గం

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలి


కళ్యాణదుర్గం అంబేడ్కర్ సర్కిల్‌లో ధర్నా చేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్: ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలని వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి మందల రమేష్ అన్నారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్లో వీసీకే పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి మందల రమేష్ అధ్యక్షతన ధర్నా చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏను రెన్యూవల్ చేయకుండా అడ్డుపడడం సరికాదన్నారు. కార్యక్రమంలో వీసీకే పార్టీ నాయకులు రవి, బొమ్మన్న, కళ్యాణ్, హరి, గంగాధర్, మహాలింగ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కూడేరు: గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2025–26 ఆర్థిక సంవత్సరంలో పండ్ల తోటలు పెంపకానికి చిన్నసన్నకారు రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ పోలేరయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మామిడి, బత్తాయి, నాటు జామ, సపోటా, కొబ్బరి, సీతాఫలంతో పాటు మరో 10 రకాల పండ్ల తోటల పెంపకానికి మొక్కలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఐదెకరాల్లోపు ఉన్న చిన్న సన్నకారు రైతులు సెల్: 91548 71732లో సంప్రదించాలన్నారు.

రేపు వాహనాల వేలం

గుమ్మఘట్ట: ప్రొహిబిషన్, ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను ఈనెల 17న స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద వేలం వేస్తున్నట్లు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు. ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 13 ద్విచక్ర వాహనాలు, ఒక ఓమినీ వాహనాన్ని వేలం వేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైద్య శిబిరానికి మందుల వితరణ


పెన్నహోబిలంలో వైద్యశిబిరానికి మందులు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు

ఉరవకొండ రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం కౌకుంట్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి మందులు వితరణ చేశారు. గురువారం విశ్రాంత ఆర్ఎంఓ, విశ్రాంత మెడికల్ డైరెక్టర్ దంపతులు దివగంత ముత్తులూరు ఓబన్న, భారతలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు మందులు వితరణ చేశారు. మందులను పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అనికేత్‌కు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, ఎంపీపీ నరసింహులు, పార్టీ రూరల్ అధ్యక్షుడు ఎర్రిస్వామిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ తిప్పయ్య, వడ్డే ఆంజనేయులు, రాకెట్ల శీనా అందించారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ ఏటా ముత్తులూరు కుటుంబ సభ్యులు ఉచితంగా మందులు అందించడం సంప్రదాయంగా వస్తోందన్నారు.

గరుడ వాహనంపై వేంకటరమణుడి దర్శనం


గరుడ వాహనంపై శ్రీవారిని ఊరేగిస్తున్న దృశ్యం, పక్కన పెళ్లి కుమార్తె పద్మావతి (శ్రీధన్య)

రాయదుర్గంటౌన్: ప్రసన్న వేంకటరమణస్వామి గురువారం సాయంత్రం పద్మావతి అమ్మవార్ల సమేతంగా గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గరుడ వాహన అలంకరణపై స్వామి ఉత్సవ విగ్రహం పక్కన వివాహం జరిపించిన పద్మావతి (శ్రీధన్య)ని కూర్చోబెట్టి ఊరేగించారు. పద్మశాలీయ బహూత్తమ సంక్షేమ సంఘం, తొగట వీరక్షత్రియ సంఘం, స్వకులసాలె, భావ సార క్షత్రియ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన గరుడ వాహనోత్సవం వినాయక సర్కిల్, బళ్లారి రోడ్డు, బొడ్డు రాయి వరకు ఊరేగించారు. శుక్రవారం స్వామి వారి గజేంద్రవాహనోత్సవం జరుగుతుందని ఆలయ ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.

17న శ్రీవారి బ్రహ్మరథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో ప్రధాన ఘట్టమైన వేంటకరమణస్వామి బ్రహ్మోరథోత్సవం 17న నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు మడుగు తేరు, సాయంత్రం 4 గంటలకు బ్రహ్మ రథోత్సవం జరుగుతుందని ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.

పౌష్టికాహార ఆవశ్యకతపై అవగాహన


పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రావణ్‌కుమార్

బొమ్మనహాళ్: తల్లీబిడ్డ ఆరోగ్యం కోసం పౌష్టికాహార ఆవశ్యతపై డాక్టర్ శ్రావణ్‌కుమార్ అవగాహన కల్పించారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. వారికి అవసరమైన మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తప్పకుండా తాగించాలన్నారు. గర్భిణులు ఆరోగ్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. గర్భిణుల్లో రక్తహీనత ఏర్పడితే ప్రసవంలో ఇబ్బందిపడే ప్రమాదం ఉందన్నారు. ఆరోగ్య సూత్రాలు వివరించారు. బీపీ పెరిగితే ఫిట్స్ వచ్చే అవకాశం ఉందన్నారు. హిమోగ్లోబిన్ 10 శాతం కంటే ఎక్కువగా ఉండాలని, బీపీ 120 లోపు ఉండాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం తల్లీబిడ్డకు క్షేమమని అన్నారు. 31 మందికి గర్భిణులకు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో విరిగిపడిన చెట్లు


కళ్యాణదుర్గంలో కారుపై కూలిన చెట్లు


సూగేపల్లి వద్ద గంగపూజ పూజ చేస్తున్న మహిళలు

కళ్యాణదుర్గం: మండలంలో గురువారం వేకువజామున ఈదురుగాలుల బీభత్సంతో చెట్లు విరిగిపడ్డాయి. మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట రోడ్డులో నివాసముంటున్న ఓ పత్రిక విలేకరి ఇంటి ఆవరణలో నిలిపి ఉంచిన కారుపై చెట్లు విరిగిపడ్డాయి. గాలీవాన బీభత్సానికి పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. ఉరుములు, మెరుపులతో ఒక్కసారిగా గాలులు అధికమవడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దీంతో రాత్రంతా ప్రజలు చీకట్లలో గడపాల్సిన పరిస్థితి.

కూడేరు: మండల వ్యాప్తంగా గురువారం వేకువజామున మోస్తరు వర్షం కురిసింది. వర్షా కాలానికి ముందుగానే వర్షాలు కురుస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నేలను బాగా దుక్కి చేసుకోవడానికి వీలుంటుందంటున్నారు.

బ్రహ్మసముద్రం : మండల వ్యాప్తంగా గురువారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి వాగులు, వంకలు, చెక్ డ్యాంలు పొంగిపొర్లాయి. మండలంలోని సంతే కొండాపురం చెరువులోకి పెద్ద ఎత్తున వరదనీరు చేరుతోంది. సూగేపల్లి వద్ద వాగులో వరద నీరు పొంగి పొర్లడంతో గ్రామస్తులు, మహిళలు గంగమ్మకు పూజలు చేశారు. భారీ వర్షానికి ఐదుకల్లు – సూగేపల్లి గ్రామాల పొలాల మధ్య మట్టి రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో రైతులకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

కూడేరులో చిరుత సంచారం

కూడేరు: స్థానిక అరవకూరు మార్గంలోని కొండ ప్రాంతంలో గురువారం ఓ చిరుత పులి సంచారాన్ని పశువుల కాపర్లు గుర్తించారు. చిరుతను గమనించిన కాపర్లు గట్టిగా శబ్దాలు చేయడంతో వెనుతిరిగి కొండలోకి పరుగు తీసింది. చిరుతను బంధించాలని ఈ సందర్భంగా స్థానికులు కోరారు.

రేపే 'సేవ్ ఆర్డీటీ' బైకు ర్యాలీ

- ఆర్డీటీ కోసం ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలి
- రూట్ మ్యాప్ సిద్ధం చేసిన మాజీ ఎంపీ తలారి రంగయ్య


బైకు ర్యాలీకి పిలుపునిస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య, పార్టీ నేత ఉమ

కళ్యాణదుర్గం: జిల్లాలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వాలతో దీటుగా పని చేసిన ఆర్డీటీ సంస్థకు కేంద్రం నిలుపుదల చేసిన ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన 'సేవ్ ఆర్డీటీ' బైకు ర్యాలీకి రూట్ మ్యాప్ సిద్ధమైంది. గురువారం పార్టీ సమన్వయకర్త, మాజీ ఎంపీ, పార్టీ పీఏసీ సభ్యుడు డాక్టర్ రంగయ్య బైకు ర్యాలీ రూట్ మ్యాప్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 17న ఉదయం 8:30 గంటలకు బ్రహ్మసముద్రం నుంచి నియోజకవర్గ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, ఆర్డీటీ లబ్ధిదారులు, రాజకీయ నాయకులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, మేధావులు, విద్యావేత్తలు, ఉద్యోగులు, విద్యార్థులతో కలిసి 'సేవ్ ఆర్డీటీ' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

కార్యక్రమ రూట్ మ్యాప్ ఇలా..

17న ఉదయం 8:40 గంటలకు నంజాపురం, 9 గంటలకు మామడూరు, 9:20 గంటలకు పాలవెంకటాపురం, 9:40 గంటలకు బసంపల్లి, అనంతరం 9:50 గంటలకు శెట్టూరుకు బైకు ర్యాలీ చేరుకుంటుందన్నారు. 10:10 గంటలకు చింతర్లపల్లి, 10:30 గంటలకు మాకొడికి, 10:50 గంటలకు లక్ష్మంపల్లి, 11 గంటలకు కంబాలపల్లి, 11:15 గంటలకు అపిలేపల్లికి చేరుకొని 11:25 గంటలకు కుందుర్పికి చేరుకుంటుందన్నారు. 11:40 గంటలకు మహంతపురం చేరుకున్న అనంతరం మధ్యాహ్నం 12:40 గంటల వరకు భోజన విరామం ఉంటుందన్నారు. భోజన విరామం అనంతరం తిరిగి 12:55 గంటలకు బెస్తరపల్లి, 1:10 గంటలకు తూముకుంట, 1:25 గంటలకు తెనగల్లు, 1:40 గంటలకు ఎస్.మల్లాపురం, 1:55 గంటలకు ఓబుగానిపల్లి, 2:10 గంటలకు జక్కిరెడ్డిపల్లి, 2:20 గంటలకు కొత్తపల్లి మీదుగా 2:30 గంటలకు కంబదూరు మండలానికి చేరుకుంటుందని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 2:50 గంటలకు అండేపల్లి, 3:10 గంటలకు కదిరిదేవరపల్లి, 3:20 గంటలకు ములకనూరు, 3:30 గంటలకు దాసంపల్లి, 3:40 గంటలకు బోయలపల్లి, 3:50 గంటలకు కామక్కపల్లి మీదుగా 4:30 గంటలకు బైకు ర్యాలీ కళ్యాణదుర్గం చేరుకుంటుందన్నారు. అనంతరం ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి ఆర్డీటీని కాపాడుకోవడానికి ఆర్డీటీకీ ఎఫ్‌సీఆర్ఏను వెంటనే పునరుద్ధరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తామని ఆయన తెలిపారు.

పేదల కోసం పోరాటం ..

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలోనే కాదు రాష్ట్రంలో ఆర్డీటీ లాంటి స్వచ్ఛంద సంస్థను ఎన్నడూ చూడలేదన్నారు. విదేశీ మహనీయుడు డాక్టర్ ఫాదర్ ఫెర్రర్ అనంతపురం జిల్లాలో పేదరికాన్ని రూపు మాపేందుకు ఇక్కడ వచ్చి ప్రభుత్వాలకు దీటుగా విద్య, వైద్యం, వ్యవసాయం, కులవృత్తులు, యువతకు ఉపాధి, పొదుపు సంఘాలు ఇలా ఎన్నో సంక్షేమ, సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. ఇలాంటి సంస్థకు చెందిన ఎఫ్‌సీఆర్ఏను రెన్యూవల్ చేయకపోవడం బాధాకరమన్నారు. మహాభారతంలో రాముడికి ఉడత సాయం చేసిందంటారు...చిన్న ఉడత ఎంత ఇసుక పట్టుకుని వచ్చిందో అందరికీ తెలుసునని, ఆ మాదిరిగానే జిల్లాలో ఆర్డీటీని కాపాడుకోవడానికి తనవంతుగా ఉడతాభక్తిగా పోరాటం చేస్తామన్నారు. దీనికి నియోజకవర్గ ప్రజలందరూ మద్దతు తెలిపాలని ఆయన కోరారు.


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బైక్ ర్యాలీని విజయవంతం చేయండి

శెట్టూరు : సేవ్ ఆర్డీటీ కార్యక్రమంలో భాగంగా ఈనెల 17న వైఎస్సార్‌సీపీ తలపెట్టిన బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎమ్ఎస్ రాయుడు , ఎంపీపీ సోమ్‌నాథ్‌రెడ్డి తదితరులు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్ తదితరులు విలేకరులతో మాట్లాడారు. బ్రహ్మసముద్రంలో ప్రారంభమయ్యే ర్యాలీ మండలంలో బసంపల్లి, శెట్టూరు, చింతలపల్లి, మాకొడికి , లక్ష్మంపల్లి, కంబాలపల్లి గ్రామాల మీదుగా కుందుర్పి మండలంలోకి ప్రవేశిస్తుందన్నారు. పేదలకు అండగా ఉన్న ఆర్డీటీని కాపాడేందుకు పార్టీ తలపెట్టిన కార్యక్రమానికి అన్ని గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున రావాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెవుల కిష్టప్ప, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు హరినాథ్‌రెడ్డి, మిద్ది సుధాకర్, మహాబలి, ప్రతాప్, బోయ తిప్పేస్వామి, సర్పంచ్‌లు గంగాధర్, వెంకటేశులు, నాయకులు వీరబద్రప్ప, వీరాంజనేయులు, చటాకుల రామాంజనేయులు, బాలు, గోపి, టైలర్ వన్నూర్‌స్వామి, లింగప్ప, నరసింహులు, చికెన్ రఫి, జీవన్ గోపాల్‌రెడ్డి , మహేష్, తిప్పేస్వామి, ధనుంజయ, ఉదయ్, గంగాధర్, నరసింహులు, హరి పాల్గొన్నారు.

కనుల పండువగా పల్లకీ ఉత్సవం


వజ్రకరూరు: స్థానిక షిర్డీసాయి ఆలయంలో గురువారం సాయంత్రం పల్లకీ ఉత్సవం కనులపండువగా జరిగింది. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, తీర్థప్రసాదాల వినియోగం జరిగింది. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకీ ఉత్సవం కనుల పండువగా జరిగింది. రాత్రికి శేజ్ హారతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు ఆలయానికి చేరుకొని స్వామిని దర్శించుకున్నారు.

ఎంఈఎఫ్ సభ్యత్వ నమోదు


ఉరవకొండలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఉరవకొండ: స్థానిక ఎమ్మార్పీఎస్ కార్యాలయం వద్ద ఎంఈఎఫ్ (ఎమ్మార్పీఎస్ అనుబంధం) సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ మాట్లాడుతూ మాదిగ ఉద్యోగుల సమాఖ్య బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం ఎంఈఎఫ్ జిల్లా గౌరవ సలహాదారు సాకే భాస్కర్ రూ.వెయ్యి చెల్లించి సభ్యత్వ నమోదు రశీదును జాతీయ ప్రధాన కార్యదర్శి శంకర్ చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు మన్నెపాకుల రమేష్, జిల్లా కమిటీ సభ్యులు మీనుగ భాస్కర్, బండారు నాగేంద్ర, నియోజకవర్గ అధ్యక్షుడు సింగాడి దుర్గాప్రసాద్, శ్రీనివాసులు, సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాలతో అవస్థలు


రాయదుర్గం మీదుగా వెళ్తున్న భారీ వాహనం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం మీదుగా భారీ వాహనాల రాకపోకలు ప్రమాదకరంగా మారుతున్నాయి. పట్టణంలో పార్కింగ్ సమస్యతో ఫుట్‌పాత్‌లు సైతం కనిపించడంలేదు. దీంతో పాదాచారులు, స్థానికులు రోడ్డుపై వెళ్లాల్సిన పరిస్థితి. జాతీయ రహదారిపై ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం పూర్తికాక పోవడం, పాత బైపాస్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి కింద భారీ వాహనాలు వెళ్లేందుకు వీలులేక పట్టణం మీదుగా వెళ్తున్నాయి.